క్లుప్తంగా

నర్సరీలో నాగుపాము



పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ శ్రీనివాస్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ ఎస్‌కేఎంఎల్ నర్సరీలో సోమవారం 8 అడుగుల నాగుపాము భయ భ్రాంతులకు గురి చేసింది. రోజు మాదిరిగానే నర్సరీ తెరిచేందుకు యజమాని శ్రీను వచ్చాడు. సామన్లు ఉన్న గదిని తెరవగా, ఎదురుగా నాగుపాము కనిపించడంతో ఆందోళనకు గురయ్యాడు. వెంటనే ఆయన స్నేక్ క్యాచర్ శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. ఆ పామును స్నేక్ క్యాచర్ శ్రీనివాస్ చాకచక్యంగా పట్టుకుని జనాల్లేని ప్రదేశంలో విడిచిపెట్టారు.

క్రికెట్ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

తగరపువలస: సంగివలస పోలమాంబ లెవెన్స్ క్రికెట్ క్రీడాకారులకు సోమవారం తగరపువలస పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రాము నాయుడు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ పోటీల్లో సంగివలస క్రీడాకారులు తమదైన ప్రతిభ చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీమ్ మేనేజర్ చిల్ల రమేష్, అక్కరమాని లోవరాజు, క్రీడాకారులు ఊళ్ల వెంకట్, నరేష్, నరేంద్ర, హరీష్, నర్సింగ్ పాల్గొన్నారు.

తెలగ సేవా సంఘం సాయం

తగరపువలస: ఇటీవల మరణించిన పల్ల అప్పలనరసమ్మ పెద్దకర్మ, గృహ మరమ్మతుల నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులకు చిట్టివలస తెలగ సేవా సంఘం ప్రతినిధులు సోమవారం నిత్యావసర సరకులతో పాటు రూ.31వేల సాయం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రంగూరి సీతారామదొర మాట్లాడుతూ సంఘం సభ్యుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. సంఘ ప్రతినిధులు సుంకరి రాంప్రసాద్, రంగూరి రామ్‌కుమార్, మేకల శ్రీను, రంగూరి శ్రీను, కొంకిపూడి శంకర్, రంగూరి సుందర్‌సింగ్, రొక్కం శ్రీను, రంగూరి కృష్ణ పాల్గొన్నారు.

దాకమర్రి శివారులో మృతదేహం లభ్యం

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి శివారులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పూర్తిగా పాడైపోయి కనిపించింది. కోవిడ్ తరువాత గుర్తు తెలియని వ్యక్తి ఈ ప్రాంతంలో సంచరిస్తూ స్థానికులు పెట్టే భోజనంతోనే కాలక్షేపం చేసేవాడు. సోమవారం స్థానికులు అతనిని వెతుక్కుంటూ భోజనం పట్టుకుని వెళ్లగా.. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి కనిపించింది. భీమిలి ఎస్ఐ గంటా హరీష్ సంఘటనా స్థలానికి చేరుకుని సర్పంచ్ చెల్లూరి పైడప్పుడు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, చెల్లూరి సంతోష్‌ల సాయంతో స్థానిక శ్మశానవాటికలో మృతదేహాన్ని ఖననం చేశారు.

భవనం పైనుంచి జారిపడి కార్మికుడి మృతి

పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీలో సోమవారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న మూడో అంతస్తు నుంచి జారిపడి గుణదల శంకరరావు(38) మృతి చెందాడు. మధురవాడ జోన్ మారికవలసకు చెందిన శంకరరావు మూడో అంతస్తులో గోడకు ప్లాస్టరింగ్ పనులు చేస్తున్నాడు. 4 గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ప్లాస్టరింగ్ కరిగిపోకుండా టార్పాలిన్ కప్పడానికి పైకి వెళ్లి జారిపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన శంకరరావును విజయనగరం మహారాజా ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జోన్-2 స్పందనకు 10 అర్జీలు

మధురవాడ: మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం జెడ్సీ కె.కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు వివిధ వార్డుల నుంచి పలు సమస్యలపై 10 అర్జీలు వచ్చాయి. టౌన్ ప్లానింగ్-03, పబ్లిక్ హెల్త్-2, విద్యుత్, యూసీడీ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున, ఇంజినీరింగ్ వర్క్స్‌కు-3 అర్జీలు వచ్చాయని, తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ తెలిపారు. జీవీఎంసీ 6వ వార్డు ప్రశాంతినగర్‌లో నివాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని కాలనీకి చెందిన డి.జగన్నాథం కోరారు.

జెండా పండగకు సన్నద్ధం

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో స్వాతంత్య్ర సంబరాలకు విద్యా సంస్థలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, కార్మిక, స్వచ్ఛంద సంఘాలు ముమ్మర సన్నాహాలు చేస్తున్నాయి. మంగళవారం ఉదయం నిర్వహించే పంద్రాగస్టు వేడుకలకు పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. విద్యా సంస్థల్లో ఇప్పటికే విద్యార్థులు పోటీలు పడి మరీ రంగు రంగుల కాగితాలు, త్రివర్ణ పతాకాలతో తరగతి గదుల్ని, విద్యాసంస్థలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డుకు చెందిన రాయిప్పాలెం హైస్కూల్ విద్యార్థులు ఒక అడుగు ముందుకు వేసి పర్యావరణానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మొక్కలు, మట్టి, సాధారణ రంగులతో ఆహ్వానపత్రాలు, రంగవల్లులు తీర్చిదిద్దుతున్నారు. క్లాత్ ఉపయోగించి జాతీయ జెండాలను తయారు చేస్తున్నారు. మట్టి పాత్రలు, కలశాలు, పూర్ణకుంభానికి సొంతంగా మట్టిపాత్రలు తయారు చేసి, వాటికి జాతీయ జెండాలోని రంగులతో వన్నెలద్దారు.



క్లాత్‌తో జెండాలు తయారు చేస్తున్న విద్యార్థులు

శిల్పారామంలో ప్రత్యేక కార్యక్రమాలు

పీఎం పాలెం: భారత స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం(జాతర)లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు స్థానిక పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు జోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో దేశభక్తి గీతాలకు నృత్యాలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

దైవభక్తితో పాటు దేశభక్తి అవసరం

తగరపువలస: దైవభక్తితో పాటు ప్రతి ఒక్కరికి దేశభక్తి కూడా అవసరమని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బైబిల్ మిషన్ సేవకుడు రెవరెండ్ ఎం.ఎం.జాకబ్ అన్నారు. సోమవారం భీమిలి పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మరడపాలెం బైబిల్ మిషన్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. పాస్టర్లు జాతీయ జెండాలు పట్టుకుని దేశం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఫెలోషిప్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మోహన్‌కుమార్ కాటన్, జాన్ కాంతయ్య, సంతోష్‌పాల్, పి.ఎస్.ప్రసాద్, పి.జాషూవా, సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్ పాల్గొన్నారు.



మరడపాలెం బైబిల్ మిషన్ చర్చిలో జాతీయ జెండాలతో భీమిలి ఎంపీపీ వాసురాజు, పాస్టర్లు

హోటళ్లు, రిసార్టుల యాజమానులకు అవగాహన

తగరపువలస: హోటళ్లు, లాడ్జిలు, రిసార్టులు, రెస్టారెంట్ల యాజమాన్యాలు తమ దైనందిన వ్యాపారాల్లో అపరిచితుల పట్ల అప్రమత్తగా ఉండాలని భీమిలి పోలీస్ స్టేషన్ సీఐ డి.రమేష్ హెచ్చరించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో స్థానిక వ్యాపార సంస్థల యజమానులతో ఆయన సమావేశం అయ్యారు. చెక్ ఇన్, చెక్ అవుట్‌లకు సంబంధించి సరైన పద్ధతిలో రిజిష్టర్లు నిర్వహించాలన్నారు. గెస్టుల ఆధార్‌కార్డు, మిగిలిన వివరాల నమోదుతో పాటు సీసీ కెమెరాలలో వారి ముఖాలు కవర్ అయ్యేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విజిటర్ మానిటరింగ్ సిస్టమ్ గురించి వివరించి, సక్రమంగా నిర్వహించాలన్నారు. మద్యం అనుమతులు లేనందున ఎలాంటి పరిస్థితులలోనూ వాటికి అవకాశం ఇవ్వరాదన్నారు. పనికోసం వచ్చేవారి యాంటిసిడెంట్ సర్టిఫికెట్ పరిశీలించిన తరువాతే విధుల్లోకి తీసుకోవాలన్నారు.



హోటళ్లు, లాడ్జిలు, రిసార్టుల యజమానులతో మాట్లాడుతున్న సీఐ రమేష్

'స్పందన'కు మూడు వినతులు

తగరపువలస: భీమిలి జోన్ రెండోవార్డులో కల్యాణమండపం, కమ్యూనిటీహాలు నిర్మించాలని జెడ్సీ బి.రాముకు సోమవారం స్పందనలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వినతిపత్రం అందించారు. ఇటీవల భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తగరపువలసలో పర్యటించినపుడు సంతపేట రెడ్డివీధి, గొల్లవీధి, కుమ్మరివీధి, గ్రంథాలయవీధి, ఆదర్శనగర్, సత్యనారాయణపేట గ్రామస్తులు ఈ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంతపేట గొల్లవీధిలోని జీవీఎంసీ స్థలంలో కమ్యూనిటీ హాలు, రెడ్డివీధి రామాలయంలో కల్యాణ మండపం ఆవశ్యకతను వివరించారు. దీనిపై ఎమ్మెల్యే అంగీకారం తెలపడంతో ఈ మేరకు జెడ్సీకి వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో వార్డు ప్రధానకార్యదర్శి చిప్పాడ వెంకటేష్, నాయకులు సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, నీలాపు సురేష్‌రెడ్డి, కొండపు శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో జరిగిన స్పందన కార్యక్రమానికి మూడు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రెండు, ప్రజారోగ్య విభాగ సమస్యపై ఒక వినతి వచ్చింది. వచ్చిన వినతులను పరిశీలించిన జెడ్సీ, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని వారికి భరోసానిచ్చారు.

క్యాన్సర్ బాధితుడికి చేయూత

తగరపువలస: రెండేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న భీమిలి మండలం అన్నవరం పంచాయతీకి చెందిన 26 ఏళ్ల వాసుపల్లి సతీష్‌కు సోమవారం అదే పంచాయతీకి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు రూ.1.20 లక్షల సాయం అందించారు. భార్య ఆదిలక్ష్మి, మూడేళ్ల కుమారుడు ఉన్న సతీష్ సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని చికిత్సకు, కుటుంబానికి దాతలు ఆసరాగా నిలవాలని హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దుర్గారావు, వాసుపల్లి రాము, ఉమ్మిడి అప్పలరాజు, ఉమ్మిడి లక్ష్మణ్, ఉమ్మిడి కిషోర్, ఉమ్మిడి రాజు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లికి పుష్పాలంకరణ సేవ



తగరపువలస: సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని సోమవారం రాత్రి కనకాంబరాలు, విరజాజులు, లిల్లీ, బంతి పువ్వులు, తులసిమాలలతో అలంకరించారు. మంగళవారం అమ్మవారిని ఈ ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అలంకరణకు సంతపేటకు చెందిన కాకి చందు సహాయం చేశారు. చిప్పాడకు చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి, తాళ్లవలస పంచాయతీకి చెందిన బోని ఈశ్వరరావు ఈ అలంకరణ చేశారు.

17 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు

కొమ్మాది: శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో ఈ నెల 17 నుంచి శ్రావణమాస ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. 17న కలశ స్థాపన, 18న 1,008 తామర పువ్వులతో అష్టలక్ష్మీ హోమం, 21న గరుడ పంచమి, 25న లక్ష్మీనారాయణులకు వజ్రకవచధారణ, 30న లక్ష్మీనారాయణుల నిజరూప దర్శనం, 31న పంచామృతాభిషేకం నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 1న విశేష అర్చనలు, 7న శ్రీవైష్ణవ కృష్ణాష్టమి, 8న 108 పట్టుచీరలతో వస్త్రార్చన జరపనున్నట్లు వెల్లడించారు.

పచ్చదనం పెంపు అవసరం

పద్మనాభం: పచ్చదనాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని ఏడు పంచాయతీల్లో సోమవారం నా భూమి-నా దేశం కార్యక్రమాలు జరిగాయి. మద్దిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరూ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. ముందుగా ఆయన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయకుమార్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఎ.రఘుపతిరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో జి.వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు బుగత సత్యనారాయణ, బుగత ఎర్నాయుడు పాల్గొన్నారు.

- విలాస్కాన్‌పాలెంలో సర్పంచ్ నల్లి సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు బోని సావిత్రి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. పాండ్రంగిలో సర్పంచ్ పల్లి ఝాన్సీ, కృష్ణాపురంలో సర్పంచ్ మొకర లక్ష్మీ భవాని, చిన్నాపురం, నేరేళ్లవలస గ్రామాల్లో ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, తునివలసలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర బంగారప్పడు శిలా ఫలకం ఆవిష్కరణ చేశారు.

'ర్యాగింగ్ ఓ అనాగరిక చర్య'

పీఎం పాలెం: విద్యార్థులు సోదర భావంతో మెలగాలని, ర్యాగింగ్ వంటి అనాగరిక చర్యలకు పాల్పడవద్దని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యురాలు టి.సింధూర సూచించారు. సోమవారం సాంకేతిక విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాల నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ డే సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. కళాశాల వాతావరణం ఎప్పుడూ ఆహ్లాదభరితంగా ఉండాలన్నారు. విద్యార్థుల ఉత్తమ నడవడికతోనే అది సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జికూటివ్ డైరెక్టర్ ఎస్.రాహుల్ ఆళ్వార్ దాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన

మధురవాడ: ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు దాటేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని పీఎం పాలెం ట్రాఫిక్ ఎస్ఐ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం మధురవాడ డైలీ మార్కెట్‌లో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లు అమర్చిన వాహనం ద్వారా రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటపుడు మితిమీరిన వేగం, నిర్లక్ష్యం పనికిరాదని హితవుపలికారు. హెల్మెట్, సీటు బెల్ట్ వంటివి పెట్టుకోవడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వలన ప్రమాదాలను చాలా వరకు నియంత్రించవచ్చన్నారు. ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

8 పంచాయతీ వార్డు స్థానాలు ఏకగ్రీవం

ఆనందపురం : భీమిలి నియోజకవర్గంలో 8 పంచాయతీ వార్డుల సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆనందపురం మండలంలో 4 పంచాయతీ వార్డు స్థానాలు ఏకగ్రీవమైనట్టు అధికారులు ప్రకటించారు. సోమవారం ఉపసంహరణ ప్రక్రియ చేపట్టడంతో ఒక్కొక్క నామినేషన్ మిగిలాయి. వెల్లంకి పంచాయతీ ఆరో వార్డు(ఎస్సీ) స్థానానికి వాసి ఆదిలక్ష్మి, 12వ వార్డు(జనరల్) స్థానానికి సాడి బంగారమ్మ, కణమాం పంచాయతీ 3వ వార్డు(ఎస్సీ మహిళ) స్థానానికి ఎరుకొండ కృష్ణకుమారి, పాలవలస పంచాయతీ 1వ వార్డు (బీసీ మహిళ) స్థానానికి నిమ్మల లక్ష్మి ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి, ఎంపీడీవో అడపా లవరాజు ప్రకటించారు. భీమిలి మండలం టీ.నగరపాలెం పంచాయతీ 10వ వార్డు సభ్యుడిగా పి.రామారావు ఎన్నికయ్యారు.

పద్మనాభం: మండలంలోని మూడు పంచాయతీలకు సంబంధించి ముగ్గురు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ ఆఫీసర్ అరసాడ రఘుపతిరావు తెలిపారు. చిన్నాపురం రెండో వార్డు సభ్యునిగా పిల్లా కృష్ణ, బాందేవపురం పదో వార్డు సభ్యురాలిగా గంగిరెడ్ల లక్ష్మి, రెడ్డిపల్లి తొమ్మిదో వార్డు సభ్యురాలిగా బోని పద్మావతి ఎన్నికయ్యారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

మధురవాడ: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.ప్రశాంతి అన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యమేళా సందర్భంగా సోమవారం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అందుబాటులో ఉన్న చికిత్స, మందుల గురించి వివరించారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం నుండి బోయపాలెం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. నగరపాలెం నుంచి కాపులుప్పాడ వరకు 40 అడుగుల రోడ్డుగా, కాపులుప్పాడ నుంచి బోయపాలెం వరకు 100 అడుగుల మేర రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు జీవీఎంసీ పట్టణ ప్రణాళిక ఏసీపీ డి.శ్రీనివాస్ తెలిపారు. రోడ్డు విస్తరణపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.



నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

మెయిన్ రోడ్డులో వెలుగులు



మెయిన్ రోడ్డులో వెలుగుతున్న విద్యుద్దీపాలు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ఎట్టకేలకు తగరపువలస మెయిన్ రోడ్డులో విద్యుద్దీపాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. 'తగరపువలస మెయిన్ రోడ్డులో అంధకారం' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ భీమిలి జోన్ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. మెయిన్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ప్రైవేట్ మార్కెట్ వరకు వెలగని విద్యుద్దీపాల స్థానంలో కొత్తవి అమర్చారు. దీంతో వాహనచోదకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.







పాఠశాల సందర్శన

తగరపువలస: బంగ్లామెట్ట పాఠశాలను ఎంఈవో-1 శివరాణి సోమవారం సందర్శించారు. పుస్తకాలు, పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనం తదితర వాటిని పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. టాయిలెట్ల నిర్వహణపై శానిటేషన్ సిబ్బందితో మాట్లాడారు.





